క్లుప్తంగా

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి



కామారెడ్డి టౌన్‌: ఇటీవల తొలగించిన 12 మంది మున్సిపల్ కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని తెలంగాణ మున్సిపల్ స్టాఫ్, ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. గత మూడు సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న కార్మికులను అకారణంగా తొలగించారని, వారికి న్యాయం చేయాలని కోరారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రవిచంద్ర, నాయకులు లక్ష్మణ్, రాజు, వీల్. నర్సింహారెడ్డి తదితరులున్నారు.

ప్లాస్టిక్ నిర్మూలనకు చర్యలు తీసుకోవాలి



ఎల్లారెడ్డి: పట్టణంలో ప్లాస్టిక్ నిర్మూలనకు తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక నాయకులు గురువారం మున్సిపల్ కమిషనర్ మహేష్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. పట్టణంలో స్థానికులు విపరీతంగా ప్లాస్టిక్ కవర్లు, యూజ్‌అండ్‌త్రో వస్తువుల వాడకంతో కాలుష్యం ఏర్పడుతుందని, ప్లాస్టిక్ కవర్లను నిషేధించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో లింగమయ్య, సాయిబాబా తదితరులున్నారు.

బాన్సువాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మోహన్‌రెడ్డి



బాన్సువాడ : బాన్సువాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ర్యాల మోహన్ రెడ్డి గురువారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధ్యక్షుడిగా మోహన్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా మొగులయ్య, ప్రధాన కార్యదర్శిగా ఖలీల్, సహాయ కార్యదర్శిగా అజీం, కోశాధికారిగా సయ్యద్ హైమద్‌లను ఎన్నుకున్నారు. ఈసందర్భంగా మోహన్‌రెడ్డి మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

తై బజార్ వేలం



మాచారెడ్డి : మండలంలోని గజ్యానాయక్ తండా చౌరస్తాలో గురువారం తై బజార్‌ను వేలం వేశారు. వేలంపాటలో తండాకు చెందిన రమావత్ రాజు రూ.7.32 లక్షలకు వేలం పాట పాడి దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీవో నాగరాజు, పంచాయతీ కార్యదర్శి రిజ్వానా బేగం, గ్రామస్తులు ఉన్నారు.

ఎర్రాపహాడ్‌లో గ్రామాభివృద్ధి కమిటీ ఎన్నిక



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని ఎర్రాపహాడ్ గ్రామంలో గురువారం గ్రామాభివృద్ధి కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఏనుగు మోహన్‌రెడ్డి, ఉపాధ్యాక్షుడిగా భీమాగోనోళ్ల నర్సాగౌడ్, గాదెల బాలయ్య, ప్రధాన కార్యదర్శిగా గైనిరాజలింగం, కోశాధికారిగా మైలారం రాజయ్య, సలహాదారులుగా బద్దంసాయిరెడ్డి, బొక్కరాజిరెడ్డి, నడిపిబాలురెడ్డి, కొంపలరాములు, బోడోళ్ల గంగారాం, దేవిరెడ్డి జలందర్‌రెడ్డి, తమ్మల సదాశివుడులను ఏకగ్రీవంగా ఎనుకున్నారు.

తైబజార్ నుంచి మినహాయింపు ఇవ్వాలి



రాజంపేట : మండల కేంద్రంలో గ్రామ పంచాయతీకి సంబంధించిన మడిగెలలో జీవనోపాధి పొందుతున్న వారికి తైబజార్ నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ గురువారం సంబంధిత యజమానులు పంచాయతీ సెక్రటరీ, ఎంపీడీవో, ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులో వినతి పత్రం అందజేశారు. గత మంగళవారం నిర్వహించిన తైబజార్ వేలం పాటలో గ్రామ పంచాయతీ మడిగెలకు రోజుకి రూ.50 చొప్పున వసూలు చేయాలని తీర్మానించి తైబజార్ వేలం పాటను నిర్వహించారు. దీన్ని వ్యతిరేకిస్తూ.. సంబంధిత యజమానులు తమకు తైబజార్ వసూలు నుంచి మినహాయింపు ఇవ్వాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

డ్రెయినేజీలు నిర్మించక ఇబ్బందులు

- మద్నూర్ మండలంలో రోడ్లపై పారుతున్న మురుగు
- అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని కాలనీవాసుల వినతి



మద్నూర్‌లోని ఇందిరానగర్ కాలనీలో..



మద్నూర్‌లోని టీచర్స్ కాలనీలో పారుతున్న మురుగునీరు

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని టీచర్స్ కాలనీ, ఇందిరా నగర్ కాలనీలో, వైఎస్సార్ కాలనీలో డ్రెయినేజీలు నిర్మించకపోవడంతో మురుగు రోడ్డుపైనే పారుతోంది. మురుగు నీరు ఇళ్ల మధ్య నిలిచి దోమలు, ఈగలు వ్యాప్తి చెంది రోగాల బారిన పడుతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు దుర్వాసన వెదజల్లుతుంది. వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా ఉంటుందని కాలనీ ప్రజలు వాపోతున్నారు. ఈవిషయమై పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవడంలేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి డ్రెయినేజీలు నిర్మించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

దుర్గంధం వస్తోంది



టీచర్స్ కాలనీలో డ్రెయినేజీ నిర్మించకపోవడంతో మురుగు ఇళ్ల మధ్య నిలిచి దుర్గంధం వెదజల్లుతోంది. మురుగు నీటిలో చెత్తా చెదారం పేరుకు పోవడంతో నీరు నిలుస్తోంది. పంచాయతీ సిబ్బంది ఎప్పటికప్పుడు డ్రెయినేజీలు శుభ్రం చేయాలి.

– అప్పు, టీచర్స్‌కాలనీ, మద్నూర్

డ్రెయినేజీలు నిర్మించాలి



మద్నూర్‌లోని ఆయా కాలనీల్లో డ్రెయినేజీలు నిర్మించక ఇబ్బందులు పడుతున్నాం. రాత్రి పూట దోమలతో ఇబ్బందిగా మారింది. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకొని త్వరగా డ్రెయినేజీలు నిర్మించాలి.

– మగ్దుమ్, ఇందిరానగర్, మద్నూర్

ఉన్నతాధికారులకు నివేదించాం

ప్రస్తుతం సీసీ రోడ్డు పనులు కొనసాగుతున్నాయి. త్వరలో డ్రెయినేజీల నిర్మాణంపై దృష్టి పెడతాం. డ్రెయినేజీలు లేకపోవడంతో ఆయా కాలనీలోని ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిసింది. ఉన్నతాధికారులకు డ్రెయినేజీల నిర్మాణంపై నివేదిక పంపించాం.

– రాణి, ఎంపీడీవో, మద్నూర్

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



నర్వలో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు



వెల్లుట్లపేటలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నిజాంసాగర్/లింగంపేట/ఎల్లారెడ్డిరూరల్/నాగిరెడ్డిపేట : మహమ్మద్ నగర్ మండలం నర్వ గ్రామంలో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను గురువారం గున్కుల్‌సొసైటీ వైస్ చైర్మన్, మండలకాంగ్రెస్ నాయకుడు గొట్టం నర్సింలు ప్రారంభించారు. లింగంపేట మండలం రాంపల్లి తండాలో గురువారం సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రారంభించారు. ఎల్లారెడ్డి మండలం వెల్లుట్లపేట గ్రామంలో కాంగ్రెస్ నాయకులు సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. గ్రామంలో రూ.ఐదు లక్షల రూపాయల ఈజీఎస్ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు సాయి బాబా ప్రారంభించారు.

నాగిరెడ్డిపేట మండలం గోపాల్‌పేటలో ఏన్ఆర్ ఈజీఎస్ నిధుల ద్వారా చేపడుతున్న సీసీ రోడ్డు పనులను గురువారం స్థానిక ఎంపీడీవో ప్రభాకరచారి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీల సంక్షేమానికి ప్రభుత్వ కృషి



ఇఫ్తార్ విందుకు హాజరైన మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి



తుంకిపల్లిలో ఇఫ్తార్ విందులో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్ రెడ్డి

బాన్సువాడ : మైనారిటీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి అన్నారు. గురువారం బాన్సువాడ పెద్ద మజీద్‌లో నిర్వహించిన ఇఫ్తార్ విందుకు ఆయన హాజరయ్యారు. కార్యక్రమంలో మజీద్ కమిటి సభ్యులు తన్ను కాంగ్రెస్ నాయకులు యలమంచలి శ్రీనివాస్ రావు, తదితరులు ఉన్నారు.

మహమ్మద్ నగర్ మండలంలో..

నిజాంసాగర్ (జుక్కల్): మహమ్మద్ నగర్ మండలంలోని తుంకిపల్లి గ్రామంలో గురువారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్ రెడ్డి ముస్లిం మైనార్టీలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. నర్వ గ్రామంలో ముస్లిం మైనార్టీలకు కారంగుల మల్లారెడ్డి ఇఫ్తార్ పార్టీ ఇచ్చారు. స్థానిక ముస్లిం మైనారిటీల నాయకులు యూసఫ్ ఖాన్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడ రూరల్: బాన్సువాడ మండలం బోర్లం గ్రామంలో ముస్లిం యువకులు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు రెడ్‌క్రాస్ సొసైటీ బాన్సువాడ డివిజన్ అధ్యక్షులు కమటాల శ్రీనివాస్‌రెడ్డి హాజరై మాట్లాడారు. అంతకు ముందు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

రంజాన్ ఏర్పాట్ల పరిశీలన

ఎల్లారెడ్డిరూరల్ : పట్టణంలో ఈద్గావద్ద రంజాన్ ఏర్పాట్ల పనులను మున్సిపల్ కమిషనర్ మహేష్‌కుమార్ గురువారం పరిశీలించారు. రంజాన్ సందర్భంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం పెద్ద మసీదు వద్ద స్థానికులతో రంజాన్ ఏర్పాట్ల గురించి చర్చించారు.

రుణమాఫీ కాని రైతులకు వోటీఎస్ ఇవ్వాలి



బాన్సువాడలో మాట్లాడుతున్న కృష్ణారెడ్డి



అడ్లూర్ ఎల్లారెడ్డిలో మాట్లాడుతున్న సదాశివరెడ్డి

బాన్సువాడ : ప్రభుత్వం అమలు చేసిన రైతు రుణ మాఫీ కాని రైతులకు వోటీఎస్ ఇవ్వాలని సహకార సంఘం అధ్యక్షుడు కృష్ణారెడ్డి అన్నారు. గురువారం బాన్సువాడ సహకార సంఘం కార్యాయలంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. దీర్ఘకాలిక రుణాల గడువు మార్చి 31తో ముగుస్తుందని, ఈ వోటీఎస్ సౌకర్యం కోసం జూన్ 30 వరకు గడువు పెంచాలని కోరారు. సమావేశంలో కార్యదర్శి నారాయణరెడ్డి, డైరెక్టర్లు తదితరులున్నారు.

సహకార సంఘాల ద్వారానే ధాన్యం కొనుగోళ్లు జరగాలి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): సహకార సంఘాల ద్వారానే వరి ధాన్యం కొనుగోళ్లు జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విండో చైర్మన్ మర్రి సదాశివ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి సహకార సంఘంలో మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను 50 శాతం ఐకేపీ కి కేటాయించే ప్రభుత్వ నిర్ణయాన్ని పునఃపరిశీలించాలన్నారు. పీఏసీఎస్ రైతులకు అందించే సేవలలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. అలాగే కుప్రియాల్ గ్రామంలో కొత్త గోదాం ను నిర్మించడం అవసరమన్నారు. వైస్ చైర్మన్ అమ్ముల పశుపతి, మానిటరింగ్ అధికారి సాయిలు, సీఈవో భైరయ్య, డైరెక్టర్‌లు పాల్గొన్నారు.

విజయ డెయిరీకి నిధుల విడుదలపై హర్షం

సదాశివనగర్: విజయ డెయిరీకి ప్రభుత్వం రూ. వంద కోట్ల నిధులు కేటాయించడంపై కామారెడ్డి పాడి రైతుల అసోసియేషన్ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. సంస్థ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డిల ఆధ్వర్యంలో గురువారం వివిధ జిల్లాల డెయిరీల ప్రతినిధులు, మేనేజర్‌లు శాసన మండలి ఆవరణలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశామన్నారు. నిధులు కేటాయించినందుకు కృతజ్ఞతలు తెలిపామని పేర్కొన్నారు.

ఎమ్మెల్యే వివేక్‌ను కలిసిన మాల సంఘం నేతలు



బాన్సువాడ : చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామిని గురువారం మాల సంఘం తెలంగాణ వ్యవస్థాపకులు అయ్యాల హైదారబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో కలిసారు. బాన్సువాడ డివిజన్‌లో నిర్వహించనున్న మాలల ఆత్మీయ సమ్మేళనంకు రావాలని ఎమ్మెల్యేను ఆహ్వానించారు. బోధన్ మండలం భవానిపేట్‌లో అంబేద్కర్ విగ్రహ సమస్యను వివరించారు.

20 సంవత్సరాల తర్వాత... ఆత్మీయ సమ్మేళనం



దోమకొండలో గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

దోమకొండ: మండల కేంద్రంలోని శివరాం మందిర్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన 2004–05 ఏడో తరగతి బ్యాచ్ విద్యార్థులు 20 సంవత్సరాల తర్వాత తిరిగి కలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమకు చదువు చెప్పిన గురువులను శాలువాలతో సన్మానించారు. ఆత్మీయంగా పలుకరించుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కాశీనాథ్, వీరయ్య, దామోదర్‌రెడ్డి, రాజు, యాదగిరి, రాజారం, పెంటయ్య, రఘు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలి



మద్నూర్‌లో మాట్లాడుతున్న ఏవో రాజు

మద్నూర్(జుక్కల్): రానున్న వానకాలంలో రైతులకు నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచాలని ఏవో రాజు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం మద్నూర్, బిచ్కుంద మండలాల విత్తనాల డీలర్లతో ఏవో సమావేశం ఏర్పాటు చేశారు. రెండు మండలాల డీలర్లు ఏ కంపెనీల నుంచి విత్తనాలు తీసుకువచ్చారో వాటి పూర్తి వివరాలు ఫారం డీలో ఆన్‌లైన్‌లో ప్రతి నెల 5వ తేదీ లోపు నమోదు చేయాలని సూచించారు. స్టాక్ రిజిస్టర్, బిల్ బుక్, స్టాక్ బోర్డ్, లైసెన్స్ ఉంచుకోవాలన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన మద్నూర్ మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ పరమేశ్ పటేల్‌కు ఏవో, డీలర్లు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డోంగ్లీ మండల ఏవో శివకుమార్, ఏఈవో సౌమ్య, అనిల్, విశాల్‌గౌడ్, రెండు మండలాల విత్తన డీలర్లు పాల్గొన్నారు.

ఒకే దేశం ఒకే ఎన్నికపై అవగాహన కల్పించాలి



భిక్కనూరు: రామేశ్వర్‌పల్లిలో మాట్లాడుతున్న విపుల్‌జైన్



ఎల్లారెడ్డిలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు దేవేందర్



మద్నూర్‌లో మాట్లాడుతున్న తుకారాం

- జమిలీ ఎన్నికలపై అపోహలను తొలగించే బాధ్యత కార్యకర్తలదే
- బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు విపుల్‌జైన్

భిక్కనూరు: ఒకే దేశం ఒకే ఎన్నికపై ప్రజలకు అవగాహన కల్పించాలని బీజేపీ రాష్ట్రకౌన్సిల్ సభ్యుడు విపుల్‌జైన్ అన్నారు. భిక్కనూరు మండలం రామేశ్వర్‌పల్లి గ్రామంలో గురువారం మండలస్థాయి బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతిఏడాది ఏదో ఒక రాష్ట్రంలో ఏదో రకమైన ఎన్నికలు ఉండటం వల్ల ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. కాంగ్రెస్‌తో పాటు పలు ప్రాంతీయ పార్టీలు దీన్ని వ్యతిరేకిస్తున్నాయన్నారు. జమిలీ ఎన్నికలపై అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు. జమిలీ ఎన్నికలపై అపోహలను తొలగించే బాధ్యత బీజేపీ కార్యకర్తలపై ఉందన్నారు.కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు ఉప్పరి రమేష్, తదితరులున్నారు.

ఎల్లారెడ్డి/సదాశివనగర్/తాడ్వాయి/మద్నూర్ : ఒకే దేశం– ఒకే ఎన్నికకు ప్రతి ఒక్కరూ మద్దతు ఇవ్వాలని బీజేపీ నాయకులు దేవేందర్ అన్నారు. ఎల్లారెడ్డిలో బీజేపీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతు కేంద్ర ప్రభుత్వ నిర్ణయమైన ఒకే దేశం– ఒకే ఎన్నికను అందరు బలపర్చాలని కోరారు. తాడ్వాయి మండల కేంద్రంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో ఒకేదేశం–ఒకేఎన్నిక అనే కార్యక్రమాన్ని బీజేపీ నాయకులు నిర్వహించారు. సదాశివనగర్‌లోని బీజేపీ కార్యాలయంలో వన్ నేషన్ వన్ ఎలక్షన్ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈసందర్భంగా అసెంబ్లీ కన్వీనర్ లింగారావు మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో బీజేపీ మరింత బలోపేతం చేయాలన్నారు. వన్ నేషన్, వన్ ఎలక్షన్‌తో దేశంలో సమూల మార్పులు వస్తాయని బీజేపీ మండల అధ్యక్షుడు తెప్పవార్ తుకారాం అన్నారు. మద్నూర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈకార్యక్రమంలో బీజేపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

ఘనంగా మాస శివరాత్రి పూజలు



దోమకొండ: మండల కేంద్రంలోని మార్కండేయ మందిరంలో గురువారం మాస శివరాత్రి పూజలను ఘనంగా నిర్వహించారు. సాయంత్రం నుంచి మహన్యాస ఏకాదశ రుద్రాభిషేక పూజలు, ఫల పంచామృత అభిషేకాలు చేశారు. నటరాజ్ భజన మండలి వారిచే భజన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

జాతర ఏర్పాట్ల పరిశీలన



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఉగాదిని పురస్కరించుకొని గోపాల్‌పేటలో నిర్వహించనున్న శ్రీ నల్ల పోచమ్మ జాతర ఏర్పాట్లను గురువారం ఎల్లారెడ్డి సీఐ రవీందర్‌నాయక్ ఆలయకమిటీ సభ్యులతో కలిసి పరిశీలించారు. జాతర ఉత్సవాలలో భాగంగా నిర్వహించనున్న ఎడ్లబండ్ల ప్రదర్శన రూట్‌మ్యాప్‌ను ఆయన పరిశీలించారు.ఆలయ కమిటీ చైర్మన్ హన్మంత్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు లక్ష్మణ్, తదితరులున్నారు.

శ్రీరామ మందిర నిర్మాణం కోసం కమిటీ ఏర్పాటు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో శ్రీ రామమందిరం నిర్మాణం కోసం గురువారం కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ అధ్యక్షుడిగా పాపనొల్ల బీరయ్య, ప్రధానకార్యదర్శిగా పెసరి సాయిలు, కోశాధికారిగా కోతి బాల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా పున్నం రాజయ్య, మర్కంటి దాకయ్య, గాదారి లచ్చిరెడ్డి, తోకల లింగం, కార్యదర్శులుగా వడ్ల బాల్‌రాజ్, జగ్గ బాల్‌రాజ్, సలహాదారులుగా దశరత్ రెడ్డి, డాక్టర్ శివారెడ్డిలను ఎన్నుకున్నారు.

నేడు రథోత్సవం

లింగంపేట : మండలంలోని అయ్యపల్లి గ్రామ శివారులోని ప్రభుస్వామి ఆలయం వద్ద శుక్రవారం తెల్లవారు జామున రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయం కమిటీ సభ్యులు తెలిపారు. ఆయా గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అలాగే ముగింపు ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు.

హనుమాన్ దీక్షా స్వాములకు భిక్ష

బాన్సువాడ రూరల్: మండలంలోని ఇబ్రహీంపేట్ గ్రామంలోని వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి దంపతులు దర్శించుకున్నారు. ఆలయంలో హనుమాన్ దీక్షా స్వాములతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన భిక్ష కార్యక్రమంలోపాల్గొని స్వాములు ఆశీర్వాదాలు తీసుకున్నారు.

సంక్షిప్తం

పశువైద్య శిబిరం

పిట్లం : మండలంలోని చిన్నకొడప్‌గల్ గ్రామంలో గురువారం వ్యవసాయ మార్కెట్ కమిటీ పిట్లం సహకారంతో పశు వైద్య శిబిరం నిర్వహించినట్లు మండల పశువైద్యాధికారి సంతోష్ పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, పశు వైద్య సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపి పరీక్షలు

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో గురువారం దివ్యాంగ విద్యార్థులకు ఫిజియోథెరపి క్యాంపు నిర్వహించారు.ఈ సందర్భంగా ఐఈఆర్‌పీ కమల్ కిషోర్ మాట్లాడుతూ వైద్యురాలు సారిక దివ్యాంగ చిన్నారులకు పరీక్షలు నిర్వహించిందన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని బాయంపల్లి, కోర్పోల్ గ్రామాల శివారులో ఉపాధి హామీలో కొనసాగుతున్న చేపల చెరువులు, మట్టి రోడ్ల పనులను గురువారం ఎంపీడీవో నరేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీల హాజరు పట్టికలను తనిఖీ చేశారు. నర్సరీ, పల్లె ప్రకృతి వనాలను పరిశీలించారు. నర్సరీలలోని మొక్కలకు ప్రతీ రోజు నీరు పట్టాలని సూచించారు.

గ్రంథాలయాన్ని సందర్శించిన విద్యార్థులు

తాడ్వాయి : మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయాన్ని గురువారం మండలంలోని సంగోజీవాడి ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులు సందర్శించారు. అనంతరం తాడ్వాయిలోని ఉన్నతపాఠశాల, పోలీసు స్టేషన్‌లను సందర్శించారు.

'విద్యార్థులు ఆంగ్ల భాషపై పట్టు సాధించాలి'

కామారెడ్డి అర్బన్: విద్యార్థులు ఆంగ్ల భాషపై పట్టు సాధిస్తేనే ఆత్మ విశ్వాసం పెరుగుతుందని, ఉద్యోగాలు సులభంగా లభిస్తాయని విశ్రాంత ప్రిన్సిపల్ పీవీ నర్సింహం అన్నారు. స్థానిక ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల జాతీయ సేవా పథకం 1,2,3 యూనిట్ల ఆధ్వర్యంలో గురువారం 6వ రోజు ఆంగ్ల భాషపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దీంతో పాటు కళాశాల ఆవరణలోని మొక్కలకు గుంతలు తీశారు. ప్రిన్సిపల్ విజయ్‌కుమార్, ప్రోగ్రాం అధికారులు రాజ్‌గంభీర్‌రావు, చంద్రశేఖర్‌గౌడ్, శారద తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

రాజంపేట : మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో సైబర్ నేరాలు, వేసవి సెలవుల్లో జాగ్రత్తలపై పోలీసు కళాబృందం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటికి వెళ్లినప్పుడు అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈతరానిదే చెరువుల వద్దకు వెళ్లొదన్నారు. ప్రతి మహిళ ఫోన్ నందు టీ సేఫ్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. కళాబృందం సభ్యులు, రాజంపేట పోలీస్ సిబ్బంది పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మద్నూర్(జుక్కల్): టీజీఆర్‌జేసీ సెట్ 2025 సంవత్సరానికి ప్రవేశాలకుగాను పదో తరగతి బాలబాలికలు దరఖాస్తు చేసుకోవాలని మద్నూర్ బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ గంగాకిషోర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని గురుకులంలో గురువారం ఆయన మాట్లాడుతు ఇంటర్ మొదటి సంవత్సరం ఇంగ్లీష్ మీడియంలో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ గ్రూపుల్లో ప్రవేశాల కోసం ఆసక్తి గల విద్యార్థులు ఏప్రిల్ 23వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రవేశపరీక్ష మే 10వ తేదీన ఉంటుందన్నారు.